
విస్ఫోటనంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఓదారుస్తున్న బంధువు

మహా.. విషాదం


బాణసంచా తయారీకేంద్రంలో అగ్నికీలలు.. చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు..

కన్నీళ్లు పెట్టుకుంటున్న కేంద్రం యజమాని కుమారుడు చిట్టిబాబు


కళ్లెదుట ఎగసిపడుతున్న మంటలు.. ఎటు చూసినా కాలిపోయి నిర్జీవంగా పడి ఉన్న మృతదేహాలు.. మరోవైపు సగం కాలిన క్షతగాత్రుల ఆర్తనాదాలు.. ఇంకోవైపు బాధిత కుటుంబీకుల ఏడుపులు.. చెల్లాచెదురుగా కాలి బూడిదైన బాణసంచా.. ఎటు చూసినా భీతావహ దృశ్యాలు... ఇదీ రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం జరిగిన మహా విషాదం.. బాణసంచా తయారీకేంద్రంలో మంటలు ఎగసిపడి ఏడుగురు మృత్యువాతపడ్డారు.. మరో ముగ్గురు ఒళ్లంతా కాలిన గాయాలతో క్షతగాత్రులుగా మారిపోయారు. ఉదయం వెళ్లొస్తాం అంటూ ఇంటి నుంచి పనికి వెళ్లినవాళ్లు అటు నుంచే తరలిరాని లోకాలకు వెళ్లిపోయారు.. చివరి చూపు కూడా దక్కనంతగా మృతదేహాలు కాలిపోయాయి.. అవి చూసిన కుటుంబీకుల కన్నీళ్లు మిన్నంటాయి.. వెళ్లొస్తాం అన్నారు.. ఇలా చేశారేంటి.. ఇక మాకు దిక్కెవరంటూ మృతదేహాలను చూస్తూ బోరున విలపిస్తున్నారు.. క్షతగాత్రుల బంధువుల మా వాళ్లను కాపాడండంటూ వైద్యులను వేడుకుంటున్నారు.


వీఎస్ఎన్ మూర్తి | పి.వెంకట రమణ | పాకా అరుణ
కుడుపూడి జ్యోతి | పెంకే శేషారత్నం | చిట్టూరి శ్యామల

మృతులు వీరే...

ప్రమాదంలో నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు మరణించారు.బిక్కవోలు మండలం కొమరిపాలెంనకు చెందిన ఫైర్స్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి (68) అలియాస్ సత్తిబాబు ఉన్నారు. కార్మికులు పాకా అరుణ (33)(సోమేశ్వరం), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50) ఘటనా స్థలంలోనే గుర్తు పట్టలేని రీతిలో సజీవ దహన మయ్యారు. బిక్కవోలు మండలం కొమరపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. విస్ఫోటనం జరిగిన ప్రదేశంలో 12 మంది ఉండగా, 10 మంది మంటల్లో చిక్కుకుపోగా ఇద్దరు మాత్రం పక్కనే ఉన్న పంట పొలంలోకి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. మూడు పశువులు గాయపడగా స్థానిక పశువుల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బాణసంచా పేలుడు.. ఏడుగురి సజీవదహనం

- ఉలిక్కిపడ్డ రాయవరం
- భోజన సమయంలో ప్రమాదం
- పేదల బతుకులపై ఫైర్
- అక్కడికక్కడే ఆరుగురి మృతి
- చెల్లాచెదురుగా మృతదేహాలు
- ఆసుపత్రిలో మరొకరు
- హృదయ విదారకంగా కేంద్రం
- హోం మంత్రి అనిత పరామర్శ

అమలాపురం/మండపేట/రాయవరం, అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెలుగులు విరజిమ్మాల్సిన బాణసంచా.. కొందరి కుటుంబాల్లో చీకటిని నింపింది. బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన ఘోర విస్ఫోటనంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. వారిలో నలుగురు మహిళలు, బాణసంచా కర్మాగారానికి చెందిన యజమాని ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం-కొమరపాలెం ప్రధాన రహదారిని ఆనుకుని రాయవరం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఈ విస్ఫోటనం సంభవించినట్టు సమాచారం. ఈ విస్ఫోటనం సమీప ప్రాంతాల్లోని ఇళ్లల్లో సైతం ప్రకంపనలు సృష్టించింది. బాణసంచా కర్మాగారం నుంచి భారీగా శబ్దాలతో పాటు దట్టమైన పొగలు ఆకాశాన్నంటాయి. దాంతో స్థానికులంతా భయభ్రాంతులకు గురయ్యారు.

అంతటా ఆర్తనాదాలే...

శ్రీలక్ష్మీ గణపతి బాణసంచా గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో రోజుకు 40 మంది వరకు పనిచేస్తారు. ఈ సంస్థ 93 ఏళ్ల నుంచి బాణసంచా తయారీలో పేరొందింది. ప్రతి ఏడాది దీపావళికి పెద్ద ఎత్తున బాణసంచా తయారుచేస్తారు. ఈ ఏడాది అదే విధంగా భారీఎత్తున బాణసంచా తయారీ చేస్తుండగా బుధవారం భారీ పేలుడు సంభవించింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. భోజన సమయంలో పది మంది బయటకువెళ్లగా, మరో 10 మంది తయారీ కేంద్రంలో యజమానితో సహా ఉన్నారు. భారీ పేలుడు, మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో మందుగుండు తయారీ చేసే కేంద్రం పైకప్పుకూలిపోయింది. ఈ పేలుడు ధాటికి మందుగుండు సామగ్రి స్టాక్ పాయింట్ కూడా నేలకూలింది. కూలీలను రక్షించే ప్రయత్నంలో యజమాని వెలుగబంట్ల సత్యనారాయణ మూర్తి అలియాస్ సత్తిబాబు మంటల్లో చిక్కుకుని కూలీలతో సహా సజీవదహనం అయ్యాడని చెబుతున్నారు. మృతుడు చేతికి ఉన్న ఉంగరాన్ని బట్టి మృతదేహాన్ని సత్తిబాబుగా గుర్తించారు. సంఘటనా స్థలంలో నేల కూలిన షెడ్డు, చెల్లాచెదురుగా మృతదేహాలు పడి ఉన్నాయి. సంఘటనా జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సంస్థ యజమాని సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిబంధనలు పాటించే సత్తిబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బాణసంచా తయారీ కేంద్రాల గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు.ఇదే వృత్తిలో కొనసాగుతూ మందుగుండుకు బలికావడంతో సత్తిబాబు కుటుంబీకులు స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ దిగ్భ్రాంతి

బాణసంచా విస్ఫోటన ఘటన తెలిసిన వెం టనే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఇక్కడకు చేరుకున్నారు. ఏడుగురి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.


హోం మినిస్టర్ అనితకు వివరాలు చెబుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కలెక్టర్ మహేష్‌కుమార్


బాణసంచా కేంద్రం నుంచి మృతదేహాల తరలింపు.. పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో దేవరకొండ అఖిల

ఎమ్మెల్యే తనయుడి వాహనంలో తరలించినా..



ప్రమాద సమాచారం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన తనయుడు టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలిన గాయాలతో నరకయాతన అనుభవిస్తున్న కొమరిపాలెం గ్రామానికి చెందిన పొట్నూరి వెంకటరమణను మనోజ్‌రెడ్డి వాహనంలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ అనపర్తిలో ఒక ఫైనాన్స్ వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తాడు. ఖాళీ సమయాల్లో కేంద్రానికి వస్తుంటాడు.. బుధవారం కూడా అలాగే వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడలో చికిత్స పొందుతూ మరణించాడు. ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రమాద స్థలం నుంచే సీఎం చంద్రబాబుకు ఇక్కడి పరిస్థితిని ఫోన్ ద్వారా వివరించారు.

చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ఘటన : ఐజీ



చిచ్చుబుడ్లలో మందు ఫిల్లింగ్ చేస్తుండగా ప్రెజర్ పెరిగి నిప్పు రవ్వలు ఎగసిపడడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్టుగా భావిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ చెప్పారు. రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌కు 2026 మార్చి వరకు బాణసంచా తయారీ అనుమతి ఉందన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తరువాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

భయపడి పరుగు తీశాం..



బాణసంచా తయారు చేసే కేంద్రంలో తరచూ తయారీదారులు మందు గుండు కాల్చడం ట్రైల్ రన్ వేస్తుంటారు. అలాంటిదే బుధవారం రాయవరంలో జరిగి ఉండొచ్చు. భోజన సమయంలో చూస్తుండగానే భారీ శబ్దాలతో కూడిన మంటలు వ్యాపించాయి. మా ఇంటి వద్ద భోజనం చేసే సమయంలో ఈ సంఘటన జరగడంతో కుటుంబమంతా పరుగులు తీశాం.

- గులిపే కృష్ణవేణి, ప్రత్యక్ష సాక్షి


ధ్వంసమైన షెడ్


ప్రమాదంపై ఐజీ అశోక్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అటెన్షన్ ప్లీజ్.. 2వది!

అమలాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది రోజుల్లో రెండో ప్రమాదమిది. గత నెల 30వ తేదీ మంగళవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలసలో బాణసంచా పేలుడు జరిగింది. కిరాణా వ్యాపారం నిర్వహించే ఇక ఇంటి వద్ద నిల్వ ఉన్న బాణసంచాను అటకపై నుంచి దించుతుండగా ప్రమాదశాత్తు పేలి దంపతులు కంచర్ల శ్రీనివాస్ (50), భార్య సీతామహాలక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందారు. భవనమంతా ఛిద్రమై నేలమట్టమైంది. ఇప్పుడిది.

10 మందిని కాపాడిన ఫంక్షన్

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రాయవరం- కొమరిపాలెం శివారులో ఉన్న ఈ బాణసంచా కర్మాగారంలో పనిచేసేందుకు గత మూడు నెలలుగా 16 మంది మహిళలు అనపర్తి, అనపర్తి సావరం నుంచి రోజువారీ వెళుతున్నారు. బుధవారం కూడా 16 మంది పనికి వెళ్లాల్సి ఉండగా, వీరిలో పదిమంది సావరంలో శుభకార్యంలో పాల్గొనాల్సి రావడంతో ఆరుగురు మాత్రమే పనికి వెళ్లారు. దాంతో మిగిలిన వారంతా ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లైంది. మూడు నెలలుగా ఒకేచోట పనిచేస్తూ కలిసి వెళ్లి వచ్చే వారిలో ముగ్గురు లేరన్న వార్తతో విషాదంలో మునిగిపోయారు.

వందేళ్ల నుంచి తయారీ

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం, బిక్కవోలు సామర్లకోట మండలం జి.మేడపాడు పరిసర ప్రాంతాల్లో బాణసంచా తయారీ శతాబ్ది కాలంగా కొన్ని కుటుంబాలకు ఆనవాయితీగా వస్తోంది. కొమరిపాలెం గ్రామానికి చెందిన వెలుగుబంట్ల కుటుంబానికి బాణసంచా తయారీకి పెట్టింది పేరు. ఇక్కడి నుంచి బాణసంచా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకే కాకుండా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ఎగుమతి జరిగేవి. రాజకీయ పార్టీల విజయోత్సవాలకు, టీడీపీ మహానాడుకూ ఇక్కడ నుంచే మందుగుండు సామగ్రిని తరలించేవారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు వీరికి అనేక పర్యాయాలు సత్కారం చేశారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన



- కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశం
- ఉప్పాడలో బహిరంగ సభ

పిఠాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన అధికారికంగా ఖరారైంది. ముందుగా కాకినాడ కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఉప్పాడలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

గురువారంఉదయం8.15గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంనుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. అక్కడినుంచి ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో కాకినాడలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు వస్తారు. అక్కడినుంచి ఉదయం 10గంటలకు కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ మత్స్యకార సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీతో సముద్రంలో కాలుష్యం, నష్టపరిహారం చెల్లింపు తదితర అంశాలపై నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అనంతరం కాకినాడలోని జీఆర్‌టీ హోటల్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకూ అక్కడే ఉంటారు. అక్కడ జనసేన నాయకులతో సమావేశమయ్యే అవకాశం ఉంది. అనంతరం పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 4.10గంటలవరకూ ఉప్పాడ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం అక్కడినుంచి హెలికాప్టర్‌లో 4.45గంటలకు రాజమహేంద్రవరంఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లి అక్కడినుంచి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి వెళ్తారు. ఈ పర్యటన మొత్తం మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారిసమస్యలు తెలుసుకోవడంతోపాటు వాటిని ఎలా పరిష్కరించాలనే అంశంపై పవన్ దృష్టి సారిస్తారని, ఉప్పాడలో బహిరంగసభ ఏర్పాటుతో మత్స్యకారులకు భరోసా కల్పించేలా ఆయన ప్రసంగిస్తారని భావిస్తున్నారు.

కలెక్టరేట్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ పర్యటన నేపథ్యంలో భారీగా బలగాలను మోహరిస్తున్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 10 గంటలకు ఆయన జిల్లా కలెక్టర్, మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో సమావేశం కానున్నారు. ఈనేపథ్యంలో కలెక్టరేట్‌లో భారీగా బారికేడ్లు ఏర్పాట్లుచేశారు. కొంతకాలంగా యు.కొత్తపల్లి మండలంలోని మత్స్యకారులు సముద్రంలో కాలుష్యం కారణంగా చేపలవేట సాగడంలేదని ఆందోళనలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ముందు జాగ్రత్తగా కలెక్టరేట్‌వద్ద భారీగా బారికేడ్లు, పోలీసుబలగాలను మోహరిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమావేశానికి వెళ్లే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీచేసి పంపే అవకాశాలు ఉన్నాయి. కలెక్టరేట్ ప్రధాన ద్వారం దగ్గర నుంచి సమావేశం జరిగే వివేకానంద హాలు వరకు ఒక ప్రత్యేకలైనులో సమావేశానికి హాజరయ్యే మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులను పంపేందుకు ఏర్పాట్లుచేశారు. కలెక్టరేట్‌కు వెనుకవైపు ఉన్న ద్వారాలను మూసివేసి పోలీసులు పహారా కాయనున్నారు. జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల బందోబస్తును ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకంగా సమీక్షించారు. పవన్ పర్యటించే అన్నిప్రాంతాలను బుధవారం ఆయన ప్రత్యేకంగా తనిఖీలు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం పరిశీలించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశం జరిగే వివేకానంద హాలుతోపాటు ప్రాంగణంలో ఏర్పాట్లను తనిఖీచేశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిఅధికారులకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చారు.


కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

భారీగా పోలీసు బందోబస్తు

పిఠాపురం/కొత్తపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తపల్లి మండలం ఉప్పాడలో జరిగే బహిరంగసభలో పవన్‌ప్రసంగిస్తారు. బహిరంగ సభ, పరిసర ప్రాంతాల్లో 550మంది పోలీసులు, అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 12మంది సీఐలు, 30మంది ఎస్ఐలతోపాటు పది రోప్‌పార్టీలు విధుల్లో పాలుపంచుకోనున్నాయి. బందోబస్తు నిమిత్తం నియమితులైనవారికి కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో ఎస్పీ బిందుమాధవ్ బుధవారం పలు సూచనలుచేశారు. ఉప్పాడ బీచ్‌రోడ్డులో నాలుగు వైపులా బారికేడ్లుపెట్టారు. సభ జరిగే ఉప్పాడ బీచ్ రోడ్డులో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

'ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ మండలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆదేశించారు. కాకినాడలో వ్యవసాయశాఖ కార్యాలయంనుంచి జిల్లాలోని మండలాల్లోఉన్న వ్యవసాయశాఖ అధికారులతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లాలో 269 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈఖరీఫ్‌లో జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలద్వారా ధాన్యంసేకరిస్తామని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ దేవులనాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో విధాన గౌతమిహాలులోని రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందికి ధాన్యం సేకరణపై శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో తేమ 17శాతంగా నిర్ణయించారన్నారు. మట్టి, రాళ్లు, ఇసుక, గడ్డి, చెత్త, కలుపు విత్తనాలు ఒక్క శాతంగా ఉండాలన్నారు. చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం గింజలు ఒక్క శాతమే అనుమతిస్తారన్నారు.






ఉత్సవంలో కనువిందు చేసిన హంస, గరుత్మంతుడు, ఏనుగు వాహనాలు

నయనానందకరం... విజయభేతాళ ఉత్సవం

ఒకేచోట కొలువుదీరిన 13 వాహనాలు... మిరుమిట్లు గొలిపిన బాణసంచా కాల్పులు

ఒళ్లు గగుర్పొడిచేలా యువకుల విన్యాసాలు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



వినాయక వాహనం



శక్తి వేషం



అగ్గిబరాటా విన్యాసాలు

అంబాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్, ఫలపుష్పాలతో అలకరించిన వాహనాలు... మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పులు... గరగ నృత్యాలు... సాంస్కృతిక ప్రదర్శనలు... కత్తిసాము, అగ్గిబరాటాలతో యువకుల విన్యాసాలు కనువిందు చేశాయి. వీటికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో బుధవారం రాత్రి జరిగిన శ్రీవిజయభేతాళస్వామి 59వ వార్షికోత్సవం వేదికైంది. అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల వారే కాకుండా ఆ ప్రాంతం నుంచి వెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు వేలాదిగా తరలివచ్చారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని 13 ప్రాంతాలకు చెందిన వాహనాలు తొలుత అక్కడ ఉత్సవం నిర్వహించుకుని అనంతరం మాచవరం సెంటర్లో కొలువుదీరాయి. యువకులు చేసిన చెడీతాలింఖానా, కర్రసాము, అగ్గిబరాటా విన్యాసాలు ఒళ్లు గగుర్పాటుకు గురిచేశాయి. అంబాజీపేట నాలుగు రోడ్ల కూడలిలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భారీ స్ర్కీన్లతో సుమారు ఐదు సినీ ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేయడంతో యువకులు ఉత్సాహంతో డ్యాన్స్ చేశారు.

13 వాహనాలు ఒకేచోట కొలువుదీరాయి. శ్రీనివాసనగర్, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామనగర్ నుంచి దుర్గమ్మ అమ్మవారు, దొమ్మేటివారిపాలెం (పాత పోస్టాఫీస్) నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి వద్ద దొమ్మేటివారిపాలెం, పోతాయిలంక నుంచి ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి విజయగణపతి, మాచవరం ఇటీకాలమ్మ గుడి, కొత్తపాలెం నుంచి హంస, చప్పిడివారిపాలెం నుంచి షిర్డీ సాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు, నందంపూడి నుంచి రాజరాజేశ్వరీదేవి వాహనాలు వచ్చాయి.

విజయభేతాళస్వామిని మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ఉత్సవాన్ని తిలకించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీచైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు వాసంశెట్టి చినబాబు, దాసరి సత్యనారాయణ, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, దొమ్మేటి శ్యామ్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జునమోహనరావు... స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




విజయభేతాళ ఉత్సవం వద్ద కత్తులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తిలకించడానికి తరలివచ్చిన జనసందోహం

హోమ్ కేర్ నర్స్ ఉద్యోగ అవకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుద్యోగ మైనార్టీ యువతకు హోమ్ కేర్ నర్స్ ఉద్యోగాల కోసం ఓవర్సీస్ మెస్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్,ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఖతర్ దేశంలోని దోహాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(నర్సింగ్)/జీఎన్ఎం(నర్సింగ్) అర్హత కలిగి, వయస్సు 21 నుంచి 40 ఉండాలన్నారు. స్త్రీ, పురుష అభ్యర్థులు, 2 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. వారానికి అరు రోజులు, రోజుకి 12 గంటలు పని చేయవలసి ఉంటుంది అన్నారు. జీతం నెలకు 5,250 రియల్స్(రూ.1.20 లక్షలు), రెండేళ్ల కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయవలసి ఉంటుందన్నారు. అదనంగా టాక్స్-ఫ్రీ శాలరీ తగ్గింపులు ఉండవు, నివాసానికి, మెడికల్, ట్రాన్స్పోర్ట్, ఫ్రీ వీసా, ఫ్లైట్ ఛార్జ్(సెలెక్ట్ అయినవారికి), సంవత్సరానికి 20 రోజులు లీవ్ బెనిఫిట్స్ ఉంటాయన్నారు. భోజనం సర్వీస్ చార్జీలు రూ.30 వేలు+ జీఎస్టీ అభ్యర్థి భరించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు పాస్ పోర్ట్, విద్యార్హతలు సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లతో దరఖాస్తులను నేరుగా ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హెడ్ ఆఫీస్, విజయవాడ అడ్రస్‌కు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సంచాలకులు పేర్కొన్నారు. 13న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఏడుగురి ఎంపిక



రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దివాన్‌చెరువు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థులు ఏడుగురు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో అండర్-17 విభాగంలో ముగ్గురు, అండర్-19 విభాగంలో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో బాటు కోచ్‌లు బోళ్ల రామకృష్ణ, ముత్యాల నాగేంద్రను మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ విమల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు అనపర్తి విద్యార్థులు

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరుగనున్న వివిధ క్రీడా పోటీలకు అనపర్తి జీబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు పలువురు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి తెలిపారు. అనంతపురంలో జరిగిన పదో ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు తమ విద్యార్థి హేమంత్ దుర్గ కీలక భూమిక పోషించినట్టు చెప్పారు. అలాగే అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ప్రసన్న భార్గవి, వాలీబాల్ జట్టుకు సాయినాథ్‌రెడ్డి, బాస్కెట్‌బాల్ జట్టుకు అజయ్ సూర్య, త్రోబాల్‌కు గీత, తనూజ, సింధు, దుర్గాభవాని ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. వీరిని అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన అనపర్తి విద్యార్థులు

14న 'నన్నయ'లో జిల్లా స్థాయి యువజనోత్సవం

సెట్రాజ్ సీఈవో విశ్వేశ్వరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025ను ఈ నెల 14న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. స్వామివివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్, కాకినాడ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుపనున్నామని బుధవారం తెలిపారు. యువతీయువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు వీలుగా 15-29 సంవత్సరాల మధ్య వయసున్న వారికి పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జానపద నృత్యం(బృందం), జానపద గేయం (బృందం) కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్, డిక్లమేషన్ పోటీలను, ఇన్నోవేషన్ ట్రాక్లో సైన్స్‌మేళా ప్రదర్శన అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు, వాటిలో ప్రథమస్థానం పొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ కార్యాలయం లింక్ ద్వారా నమోదు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు కాకినాడలోని సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

జేఎన్టీయూ గురజాడవిజయనగరం

వీసీగా సుబ్బారావు



జేఎన్టీయూకే, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం(జేఎన్టీయూ జీవీ) నూతన ఉప కులపతిగా కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విస్సాకొడేటి వెంకట సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ బుధవారం జీవో జారీ చేసింది. ఈయన ప్రస్తుతం కాకినాడ జేఎన్టీయూ రెక్టార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఫారిన్ యూనివర్శిటీ రిలేషన్స్ డైరెక్టర్‌గా,ఏపీపీజీఈసెట్ కో-కన్వీనర్‌గా, ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, విద్యోన్నతి పథక కన్వీనర్‌గా, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గా, జేఎన్టీయూకే రిజిస్ట్రార్‌గా, ఏపీఈఏపీసెట్-2025 కన్వీనర్‌గా వ్యవహరించారు. సుబ్బారావు వీసీ పదవిలో మూడేళ్లు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సుబ్బారావును జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్,రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

అంతర్వేదిలో నటి రోజా పూజలు



అంతర్వేది, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని సినీనటి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వరుదు కళ్యాణి బుధవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న వారికి వేద పండితులతో మహాదాశీర్వచనం జరిపించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెంట్ పి.విజయసారధి అందించారు.

రిపబ్లిక్ డే ప్రీ పరేడ్ శిబిరానికి

హేమంత్‌కుమార్ ఎంపిక



జేఎన్టీయూకే, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఎన్ఎస్ఎస్ వలంటీరు సింగంపల్లి హేమంత్‌కుమార్ వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపికైనట్టు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అక్టోబరు 31 నుంచి నవంబరు 9 వరకు ఈ శిబిరం జరుగుతుంది. హేమంత్‌ను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవో కిరణ్మయి అభినందించారు.



పోస్ట్.. అంటూ పోస్ట్‌మెన్ పిలిచే పిలుపుతో ఇంట్లో ఏ మూల, ఏ పనిలో ఉన్నా బయటకు రక్కున రావాల్సిందే. ఇంటికి వచ్చిన చుట్టాలు తిరుగు పయనమైన వేళ వెళ్లిన వెంటనే కార్డు ముక్క రాద్దువూ! అనే మాట చెవిలో పడాల్సిందే. పొరుగూళ్లో చదువుకునే పిల్లలకు పోస్ట్‌మెన్ ద్వారా మనీఆర్డరు అందిందంటే ఆనందమే. ఆ తరంలోని ఉత్తరాల ఊసులే వేరంటారు పెద్దలు. అంతెందుకు కలం-స్నేహం గుర్తుందా! ఉద్యోగార్థులకు పోస్ట్‌మెన్‌ని చూడని రోజున నిద్రపట్టేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఎవరైనా మృతి చెందితే ప్రత్యామ్నాయ మాటగా టపా కట్టేశారుట అనేవారు కాదాండి!. టెలిగ్రాం అనే మాట వినిపిస్తే ఉరుకులు పరుగులే. తోకలేని పిట్ట తొంభై ఊర్లు చక్కర్లు కొట్టిందనే నానుడి ఎక్కడిది? ఆధునిక పోకడలు రాక ముందున్న తపాలా జనాల్లో మమేకమైపోయింది. ఆ కబుర్లనీ పాత సినిమాల్లో మనం వినవచ్చు. అయితే ఫోన్ల ద్వారానే డబ్బులు పంపే విధానం వచ్చి మనియార్డరు ఫారాల అచ్చును ఆపేసినా.. ఈ-మెయిల్, వాట్సాప్ వచ్చి ఉత్తరాలను వెనక్కు నెట్టేసినా.. ఎర్రటి తపాలా బాక్సులు లేకపోయినా ఇప్పటికీ తపాలా వైభవమేమీ తీసిపోలేదు. ఆధునిక పోకడలను అందిపుచ్చుకుంటూ తనకు తాను తీర్చిదిద్దుకుంటూ ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తోంది. పోస్టాఫీస్ అంటే ఓ నమ్మకంగా జనం హృదయాల్లో ఓ ముద్ర వేసుకుని సాగుతోంది. నేడు అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.



- తోకలేని పిట్టకు క్రీ.పూ. 3వ శతాబ్దంలో మూలాలు
- అప్పట్లో పావురాలు, గుర్రాలు, దూతల ద్వారా టపా
- కాలక్రమేణా బలమైన సమాచార చేరవేత వ్యవస్థగా రూపాంతరం
- మనీఆర్డరుతో ఆనందం... టెలిగ్రాం వస్తే బెంబేలు
- జనంతో మమేకమైన తపాలా సేవలు



పోస్ట్... పోస్ట్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రాచీన కాలంలో దూతలు, పావురాలు, గుర్రాల ద్వారా సందేశాలను పంపించడం తపాలా వ్యవస్థకు అంకురార్పణగా చెప్పవచ్చు. క్రమేణా క్రీ.పూ.3వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుని పాలనలో ఒక శాసన సంబంధమైన సమాచార వ్యవస్థ ఏర్పడింది. ఆధునిక తపాలా వ్యవస్థ దేశంలో బ్రిటిష్ పాలకుల సమయంలో వచ్చింది. 1766లో లార్డ్‌క్లైవ్ కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారిక సమాచార మార్పిడి తపాలా సేవగా మొదలైంది. 1854లో తపాలా చట్టాన్ని తీసుకొచ్చిన లార్డ్ డల్హౌసీ ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోస్ట్స్ అనే హోదాను ఏర్పరిచారు. అప్పటి నుంచే దేశమంతా ఒకే రకమైన తపాలా రుసుములు అమల్లోకి వచ్చాయి. అదే సమయంలో మొదటి తపాలా స్టాంపు 'సింద్ డాక్' విడుదలైంది.

1947 తర్వాత భారత తపాలా శాఖ గ్రామ గ్రామానికీ విస్తరించింది. తన ఉనికికి ఎల్లలు లేవంటూ దూసుకుపోయింది. మనీఆర్డర్లు, సేవింగ్స్ ఖాతాలు, తపాలా జీవిత బీమా వంటి సేవలు ప్రజల జీవితంలో భాగమైపోయాయి. లేఖలు బట్వాడా చేసే వ్యవస్థగా కాకుండా ఆర్థిక, సామాజిక సేవల కేంద్రంగా రూపు దిద్దుకుంది. 1980 నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ 1986 నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా వేగవంతమైన టపాను అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక విధానంతో సంప్రదాయ మనీఆర్డరు కనుమరుగవుతున్న తరుణంలో ఈ-మనీఆర్డరును తెరపైకి తెచ్చింది. క్రమంగా కంప్యూటరైజేషన్ ద్వారా తపాలా కార్యాలయాలు ఆధునిక రూపంలోకి వచ్చాయి. మరిన్ని సేవలను ప్రజలకు చేరువ చేస్తూ మార్పులు చేశారు. ఇదే ఊపుతో భారత తపాలా వ్యవస్థ 'డాక్ సేవ నుంచి డిజిటల్ సేవల వరకు' అనే నినాదంతో ప్రజల గుమ్మాలకు మరింత చేరువవుతోంది.

- తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా గ్రామీణ ప్రజలను ఆర్థిక చేరికలో భాగస్వాములను చేసింది. ఆధార్ ముఖ ఆధారిత ప్రామాణీకరణ ద్వారా డిజిటల్ లావాదేవీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ బ్యాంకులో ఎక్కడా లేని విధంగా కేవలం రూ.200తో ఖాతా తెరుచుకోవచ్చు. డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలనూ తీసుకొచ్చింది. ఆర్థిక సంస్థలతో భాగస్వామ్యం ద్వారా రిఫరల్ సేవలు కూడా అందిస్తోంది.
- ఆడపిల్లలకు భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక భరోసాగా 2014 నుంచి సుకన్య సమృద్ధి యోజన అందిస్తోంది. ఈ పథకం ద్వారా పొందే వడ్డీ, గడువు తీరాక వచ్చే మొత్తానికి కూడా పన్ను ఉండదు.
- పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, పోస్టాఫీస్ సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, టైమ్ డిపాజిట్ పథకాలు, నెలనెలా నిర్ణీత మొత్తం పొదుపు చేసే రికరింగ్ డిపాజిట్, నెలవారీ ఆదాయ పథకం, కిసాన్ వికాస పత్రం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పోస్టల్ ఇన్సూరెన్స్, పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, ఆధార్ సేవలు.. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో పథకాలు, సేవలు తపాలా శాఖ ద్వారా అమలవుతున్నాయి.
- 1874లో స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) నిర్వహించిన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబరు 9న అంతర్జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1969లో జపాన్‌లోని టోక్యోలో జరిగిన యూపీయూ కాంగ్రెస్ దీనిని ప్రకటించింది. ప్రజలకు తమ దైనందిన జీవనంలో తపాలా పాత్ర, ప్రపంచ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తపాలా వ్యవస్థ సహకారం వంటి వాటిపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం.

సరళం, సులభం, నమ్మకం... పోస్టల్ సేవలు

కోటా శేషారావు
సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, తూర్పు గోదావరి



కాలక్రమేణా ఎన్ని మార్పులు వచ్చినా తపాలా సేవలు ఎప్పుడూ ప్రజలకు చేరువగా, వారి మేలుకోరి ఉంటాయి. సరళంగా, సులభంగా ఉండడంతో పాటు నమ్మకమైన సేవలు అందించడం తపాలా శాఖకు తొలి నుంచీ ఉన్న ఒక గొప్ప కీర్తిగా చెప్పవచ్చు. ఉదాహరణకు ఇన్సూరెన్స్ చాలా తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తంలో బోనస్ ఇస్తున్నాం. బయట నుంచి ఏజెంట్లు చాలా తక్కువ. దాంతో ఏజెంట్ల కమీషన్ ఉండదు. అందువల్ల ఆ లాభాన్ని వినియోగదారుడికే ఇస్తున్నాం. గతంలో ఉద్యోగులు మాత్రమే పీఎల్ఐకి అర్హులు. ఇప్పుడు అర్బన్‌లో ప్రతి గ్రాడ్యుయేట్ పీఎల్ఐ చేసుకోవచ్చు. గ్రామీణంలో ఆర్పీఎల్ఐ డిజైన్ చేశారు. ఇలా ఎన్నో సేవలు ఉన్నాయి. ప్రజలు వినియోగించుకున్నప్పుడే వాటి ఉద్దేశం నెరవేరుతుంది.

ఆఫ్రికన్ నత్తలతో..

కొబ్బరి, అరటికి నష్టం లేదు

- ప్రస్తుతం అవి బెండ, ఆనబ పంటలను ఆశిస్తున్నాయి
- కీటక విభాగ శాస్త్రవేత్త అనూష.. గంగలకుర్రులో క్షేత్రస్థాయి పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గంగలకుర్రులో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఇన్‌సెట్లో) బెండ మొక్కలను ఆశించిన ఆఫ్రికన్ నత్తలు



అంబాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై నత్తలు చేస్తున్న దాడిని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. 'ఉద్యాన పంటలపై నత్తల దాడి' శీర్షికన మంగళవారం వెలువడిన కథనానికి శాస్త్రవేత్తలు స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రులోని చిరతపూడి ఆంజనేయులు కూరగాయల తోటలను క్షేత్రస్థాయిలో వేకువజామునే కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ అనూష ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ ఆఫ్రికన్ నత్తలు ప్రస్తుతం బెండ, ఆనబ పంటలను ఆశించి తీవ్రంగా నష్టాన్ని కలుగుచేస్తున్నాయన్నారు. కొబ్బరి, అరటిలో ఈ ఉనికి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎటువంటి నష్టాన్ని కలుగజేయడం లేదని చెప్పారు. ఇవి రాత్రుళ్లు భూమిలో నుంచి పైకి వచ్చి పంటలను ఆశించి తెల్లవారే సమయానికి మొక్కల కిందకు, తోటల్లోని చెత్తాచెదారల్లోకి చేరిపోతున్నాయన్నారు. ఈ నత్తలు ఆఫ్రికా నుంచి వందల ఏళ్ల క్రితమే భారతదేశం వచ్చినప్పటికీ ఇటీవల మన రాష్ట్రంలోని పార్వతీపురం, మన్యం, తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి, కోనసీమలో వీటి ఉధృతిని శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు గుర్తించారని అనూష చెప్పారు. వీటి నివారణకు తక్షణం తోటల్లోని కలుపు మొక్కలను, చెత్త కుప్పలను తొలగించి తోటలను శుభ్రంగా ఉంచాలన్నారు. రాత్రుళ్ల నీరు పారించకూడదని, అవకాశం ఉన్న చోట తోటల్లో బాతులు, కోళ్లను పెంచుకోవాలన్నారు. పొలం గట్లపైన 1 కిలో ఉప్పును 4 లీటర్ల నీటితో కలిపి ముంచిన గోనె సంచులను పరచాలి. దీనివల్ల పక్కన ఉన్న తోటలోకి వ్యాప్తి చేయకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

సత్వర నివారణకు...

చిలేటెడ్ కాపర్ 3 గ్రాములు, ఫెర్రోమేగ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారీ చేస్తే నత్తలు 2 నిమిషాల్లోనే కిందపడి 95 శాతం చనిపోతాయి. కొన్నింటిలో కదలిక ఉన్న కింద పడిన నత్తలను ఏరి 5 కిలోల గడ్డ ఉప్పు కరిగించిన ద్రావణంలో వేస్తే కచ్చితంగా చనిపోతాయి. చివరి నత్త వరకూ చంపాలి. రైతులు సమగ్ర యజమాన్య పద్ధతులు సత్వరమే పాటించి ఈ నత్తల నుంచి పంటలను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్త అనూష సూచించారు.

స్వదేశీ వస్తువులే వినియోగించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికిరణ్
- పి.గన్నవరంలో ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికిరణ్

పి.గన్నవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అందరూ ప్రతి నిత్యావసరాలకు స్వదేశీ వస్తువులను మాత్రమే వినియోగించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రవికిరణ్ అన్నారు. పి.గన్నవరంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు.2014కు ముందు దేశంలో ఎగు మతులు 250 మిలియన్ డాలర్లు ఉంటే దిగుమతులు 500 మిలియన్ డాలర్లు ఉండేవని, 2014 తర్వాత ప్రధాని మోదీ వచ్చి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.ఈ పదేళ్లలో 900 మిలియన్ డాలర్ల ఎగుమతులు పెరిగాయన్నారు. బీజేపీ జాతీయ కార్యమండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ ఈ మూడు నెలల్లో ఒక కన్వీనర్, ఇద్దరు కో-కన్వీనర్లు ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి స్వదేశి వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇటీవల జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమితుడైన ఎస్.సాదిక్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, మండలాధ్యక్షుడు తిక్కా సత్తిబాబు, చీకరమిల్లి శ్రీనివాసరావు, గొల్లకోటి వెంకటరెడ్డి, మాలే శ్రీనివాసనగేష్, ఇళ్ల సత్యనారాయణ, టి.రామకృష్ణారెడ్డి,చెరుకూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆవేదన.. ఆక్రందన..



కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రులు

బాణసంచా పేలుడు ఘటన క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స .. బాధిత కుటుంబీకుల రోదనలు


తన తల్లి విజయలక్ష్మిని బతికించమని డాక్టర్‌ను వేడుకుంటున్న కూతురు

జీజీహెచ్(కాకినాడ) అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి.సావరం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం జరిగిన భారీ విస్ఫోటనంలో తీవ్రగాయాల పాలైన క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో 90 శాతంపైన కాలిపోయిన ఇద్దరు మహిళలు, ఒక యువకుడికి జీజీహెచ్ అత్యవసర విభాగంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు ప్రథమ చికిత్స అందిస్తుండగా క్షతగాత్రుల రోదనలతో ఆ ప్రాంతం దిక్కులు పిక్కటిల్లేలా మిన్నంటింది. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన 45 ఏళ్ల వాసంశెట్టి విజయలక్ష్మికి భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమార్తె దుర్గ కూడా తల్లితోపాటు గతేడాది కాలంగా ఆ బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తోంది. అలాగే అనపర్తికి చెందిన 30 ఏళ్ల చిట్టూరి యామినికి భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆమె గతేడాది కాలంగా పని చేస్తోంది. అలాగే పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన 21 ఏళ్ల లింగం వెంకటకృష్ణ అలియాస్ చిన్నాకు తండ్రి రాము, తల్లి వెంకటలక్ష్మి, అన్నయ్య చంద్రశేఖర్ ఒక అక్క ఉన్నారు. కాగా వెంకటకృష్ణ గత 5ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నాడు. అయితే బాణసంచా తయారీ కేంద్రంలో చిచ్చు బుడ్డును సుత్తితో దట్టించే క్రమంలో అగ్ని నెరుసులు విరజిమ్మి బాణసం చా మందుపై పడడంతో ఈ విస్ఫోటనం జరిగినట్టు ప్రమాదం నుంచి తప్పించుకుని క్షేమంగా బయట పడ్డ కార్మికులు చెప్పారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి 48 గంటలు దాటితే కాని చెప్పలేమని సర్జరీ వైద్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ అభిలాష్ తెలిపారు.

నేడు పోస్టుమార్టం..

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రమాద ఘటనలో సజీవ దహనమైన ఆరుగురి మృతదేహాలను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబీకులకు అందజేయనున్నట్టు ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ చెప్పారు. కాకినాడలో మరణించిన మరో వ్యక్తికి అక్కడే పోస్టుమార్టం చేయనున్నారు.

3 కుటుంబాల్లో విషాదం..

అనపర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాణసంచా ప్రమాదంలో అనపర్తికి చెందిన ముగ్గురు మహిళలు సజీవదహనం కావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గత 3నెలలుగా బాణాసంచా తయారీకి అనపర్తి నుంచి 16 మంది మహిళలు పనిచేసేందుకు వెళ్తున్నారు. బుధవారం ఆరుగురు మాత్రమే పనికి వెళ్లగా ముగ్గురు సజీవదహనం కాగా, మరో మహిళ తీవ్ర గాయాలతో పోరాడుతోంది. మరో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. మృతిచెందిన వారిలో అనపర్తి సావరానికి చెందిన కురుపూడి జ్యోతి (51), పెంకే శేషారత్నం(38), చిట్టూరి శ్యామల(33) ఉన్నారు. మరో మహిళ చిట్టూరి హేమ తీవ్రగాయాలతో కాకినాడఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ కలెక్టర్

రాయవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం కొమరిపాలెంలో బుధవారం జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాయవరంలో ఫైర్ వర్క్స్ నిర్వాహకులు పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించారన్నారు. గత నెల 29న అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు కూడా చేశారన్నారు. యజమాని సహా ఆరుగురు కూలీలు మృతి చెందడం బాధాకరమని,వారి కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు 37 ఉన్నాయని, 2 రోజుల్లో బాణసంచా తయారీ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని నిర్వాహకులపై కఠినచర్యలుతీసుకుంటామని చెప్పారు.

లోతుగా దర్యాప్తు చేస్తాం : ఎస్పీ

రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడు సంఘటనపై లోతైన దర్యాప్తు చేస్తామని ఎస్పీ రాహుల్‌మీనా చెప్పారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి శాంపిల్స్ సేకరించిన తరువాత వచ్చిన రిపోర్టు ఆధారంగా ఎలా జరిగిందనే విషయం వెల్లడవుతుందని తెలిపారు.

శాంపిల్స్ సేకరించిన తర్వాత స్పష్టత

పేలుడు సంఘటనా స్థలానికి రీజనల్ ఫైర్ అధికారి స్వామి చేరుకుని ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించారు. బాణసంచా తయారీ చేసే సమయంలో ప్రమాదవశాత్తూ ఫైర్ అయ్యి ఈ సంఘటన జరిగి ఉండవచ్చన్నారు. ఇక్కడ జరిగిన సంఘటనపై విజయవాడ నుంచి క్లూస్ టీం వచ్చి శాంపిల్స్ సేకరించిన తరువాత సంఘటనపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. ఆయన వెంట జిల్లా ఫైర్ అధికారి పార్థసారథి ఉన్నారు.

బాణసంచా పేలుడులో ఏడుగురు మరణించడం కలచివేసింది

మంత్రి వాసంశెట్టి సుభాష్


ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రాయవరం/మండపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఏడుగురు వ్యక్తులు మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశానికి హాజరైన మంత్రి సంఘటన విషయం తెలుసుకున్న మంత్రి హుటాహుటిన రాయవరం చేరుకుని సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. బాణసంచా తయారీ కర్మాగారాలు కనీస ప్రమాణాలు పాటించాలన్నారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్, అగ్నిమాపక సిబ్బంది, కూటమి నాయకులు ఉండవిల్లి శివ తదితరులు ఉన్నారు.

చాలా బాధాకరం

మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): రాయవరంలో బాణసంచా పేలుడు ఘటన బాధాకరమని, పండగ ముందు ఈ విషాద సంఘటన ఆయా కుటుంబాలను కలచి వేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో స్వయంగా మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

బాణసంచా పేలి ఏడుగురు మృతి చెందిన సంఘటన తనను కలచి వేసిందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బార్బడోస్‌లోని బ్రిడ్జిటౌన్‌లో ఈనెల 12వ తేదీ వరకూ జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లిన ఆమె ఈ సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ఆమె సానుభూతి తెలిపారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రమాద బాధితులకు అండగా ఉంటుందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎంపీ హరీష్

అమలాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాయవరం శివారులో బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం సంభవించిన ఘోర విస్ఫోటనంలో ఏడుగురు మృత్యువాత పడడం బాధాకరమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించి వారిని ఆదుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వారికి వెలుగులు.. వీరికి చీకటి..!

- బతుకులను బుగ్గిపాలు చేసుకుంటున్న కార్మికులు
- రాయవరం విస్ఫోటనం ఘటనలో ఏడుగురు సజీవదహనం
- 93 ఏళ్ల నుంచి ఆ కుటుంబానికి అదే వారసత్వ సంపద
- ఫైర్‌వర్క్స్ యజమాని సత్తిబాబు మరణంతో కుటుంబంలో విషాదం


ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (ఫైల్)

అమలాపురం/రాయవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగులు ఎందరికో ఆనందాన్ని, ఉత్తేజాన్నిస్తాయి. కానీ వాటిని తయారుచేసే మరికొందరికి మాత్రం విషాదాలనే మిగులుస్తాయి. ఆ తరహా ఘటనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామ శివార్లలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఈ బాణసంచా విస్ఫోటన ఘటనలో ఫైర్‌వర్క్స్ యజమాని సహా ఏడుగురు సజీవ దహనమయ్యారు. వారిలో ఐదుగురు మహిళలే. వీరంతా సగటు కార్మికులే. జీవనోపాధి నిమిత్తమే ఇక్కడ పనులు చేసుకునేందుకు సమీప గ్రామాల నుంచి వచ్చి ఈ పరిశ్రమలో ఉపాధి పొందుతున్న వారిని బాణసంచా విస్ఫోటనం పొట్టన పెట్టుకుంది.

93 ఏళ్ల ప్రస్థానం..

రాయవరం శివారు కొమరపాలెం సరిహద్దుల మధ్యలో 93 ఏళ్ల కిందట వెలుగుబంట్ల కుటుంబీకులు బాణసంచా కర్మాగారాన్ని స్థాపించి వారసత్వ సంపదగా నిర్వహిస్తున్నారు. వెలుగుబండ్ల నారాయణమూర్తి 93 ఏళ్ల కిందట శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ పేరుతో స్థాపించిన ఈ బాణసంచా కర్మాగారం నుంచి వివిధ జిల్లాలతోపాటు వివిధ రాష్ట్రాలకు సైతం తయారైన బాణసంచా ఎగుమతి అవుతుంటుంది. నారాయణమూర్తి మరణానంతరం అతని కుమారుడైన వీరన్న నిర్వహించారు. అయితే 1990 నుంచి వెలుగుబడ్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఈ వ్యాపార సంస్థను వారసత్వ సంపదగా కొనసాగిస్తున్నారు. లైసెన్సులతోపాటు పక్కా రక్షణ వ్యవస్థతో ఈ భారీ బాణసంచా కర్మాగారాన్ని నడుపుతూ వచ్చారు. అయితే బుధవారం సంభవించిన విస్ఫోటనం భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్ష సాక్షులు కొందరైతే.. చిచ్చుబుడ్డు నిప్పురవ్వల కారణంగా విస్ఫోటనం సంభవించి ఏడుగురి మరణానికి కారణమైందని చెబుతుంటే.. హోంమంత్రి సహా అధికారులు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చననే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ అమరావతి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నిపుణుల బృందం అధ్యయన నివేదిక ఇచ్చిన తరువాతే వాస్తవాలు వెల్లడవుతాయని వారు పేర్కొంటున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న ఈ బాణసంచా కర్మాగారంలో అప్పుడప్పుడు సంభవిస్తున్న ప్రమాదాల వల్ల పనిచేస్తున్న కార్మికులు తరచూ మృత్యువాత పడుతున్న ఘటనలు ఎన్నో. ఈ ఘటనలో మాత్రం యజమాని సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు అక్కడికక్కడే గుర్తుపట్టలేని రీతిలో సజీవ దహనం అయినతీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారు హృదయవిదారకంగా విలపిస్తున్నారు. ఎందరికో వినోదాన్నిచ్చే ఈ బాణసంచా తయారీ పరిశ్రమ మాత్రం పరిశ్రమల నిర్వహణదారులకు, వాటిలో పనిచేసే కార్మికుల పాలిట మృత్యుకూపంగానే మారుతోంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని భార్య మృతి.. భర్తకు గాయాలు

ప్రత్తిపాడు హైవేపై ఘటన


మృతి చెందిన సత్యవతి

ప్రత్తిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన అటికే సత్యనారాయణ, సత్యవతి దంపతులు ప్రత్తిపాడు నుంచి శరభవరం మోటార్ బైక్‌పై బుధవారం బయలుదేరారు. స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగా ధర్మవరం వైపు మార్గంలో వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలి యని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అటికే సత్యవతి (58) అక్కడికక్కడే మృతిచెందగా ఆమె భర్త సత్యనారాయణ గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగిపై దాడి


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న త్రిమూర్తులు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు ఓ విశ్రాంతి ఉద్యోగిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన 71 ఏళ్ల వాసంశెట్టి త్రిమూర్తులు విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక మునలమ్మ గుడి సందులో ఉన్న ఆయన ఖాళీ స్థలాన్ని చూసుకునేందుకు బుధవారం ఉదయం వెళ్లారు. ఆ స్థలంలో ఖాళీ మద్యం సీసాలు ఉండడాన్ని గమనించి అక్కడ ఉన్న రాలి మహేష్ విష్ణురాజును అడిగారు. దాంతో గంజాయి మత్తులో ఉన్న ఆ యువకుడు కోపోద్రిక్తుడై అక్కడే ఉన్న ఖాళీ బీరు బాటిల్‌తో త్రిమూర్తులు తలపై విచక్షణా రహితంగా మోదడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గమనించి స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న త్రిమూర్తులును జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. **Cell: 9550648668**

AJD:244834

WANTED

Supervisor required at Maruti Authorized Service Station, Kakinada,Diploma in Engineering (Automobile/Mechanical) holders with 1-2 years of experience may **Contact 9441608090.**

AJD244265

WANTED PLOTS

★ హైదరాబాద్ పటాన్‌చెరు పెద్ద కంజర్ల గ్రామములో Sy.No.120, 121 & 125 లో ప్లాట్లు అమ్మాలని ఉన్నవారు సంప్రదించాల్సిన Cell. No. 9951005666. చంద్రశేఖర్ Hyderabad.

AJH-003433

4 Lines CLASSIFIED Rs.230/- Only

వేర్వేరు ప్రాంతాల్లో రైలు నుంచి జారి పడి ఇద్దరి మృతి

తుని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ప్రాంతాల్లో మృతిచెందారు. కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో విశాఖపట్నం వైపు ముడిచర్ల ప్రాంతంలో రైలు నుంచి జారి పడి ఒకరు మృతి చెందగా మరొకరు కొత్తూరు గ్రామ సమీపంలో తిరుపతి రైలు జారి పడి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఇద్దరి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతదేహాలను ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు చెప్పారు. మృతుల సంబంధీకులెవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

బస్సు నుంచి జారి పడి మహిళ...

ద్రాక్షారామ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న బస్సు నుంచి దిగిపడిన మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరులో కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్న దమయంతి (65) జగన్నాధగిరి నుంచి ద్రాక్షారామకు బస్సులో వస్తూ బస్టాండు సమీపంలో బస్సు ఆగకుండా దిగే ప్రయత్నం చేసింది. జారి కింద పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఏరియా ఆసుపత్రికి తరలించేసరికి అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు రాకూడదు

- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి : ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ
- అన్నవరం దేవస్థానంలో కార్తీక మాస ఏర్పాట్లపై సమీక్షా సమావేశం
- గతేడాది మాదిరిగా గిరి ప్రదక్షిణలో ఉదయం పల్లకీసేవ, మధ్యాహ్నం సత్యరథసేవ


కార్తీక మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ఈవో, చైర్మన్

అన్నవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. బుధవారం అన్నవరం దేవస్థానంలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అజెండాలను చదివి వినిపించగా దానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై శాఖల అధికారులు లక్ష్యాలు నిర్దేశించారు. ఈనెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండగా నవంబరు 2న స్వామివారి తెప్పోత్సవం, నవంబరు 5న గిరి ప్రదక్షిణ జరుగుతందని వీటితోపాటుగా ముఖ్యమైన పర్వదినాలు 15రోజులుగా నిర్ధారించి ఆ రోజుల్లో 50 వేల నుంచి లక్షమంది భక్తులు విచ్చేస్తారని అంచనావేస్తూ దానికణంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులు ఎక్కడా తోపులాటలు లేకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్ పాయంట్లను ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రధానంగా రూ. 300, 1000, 1500, 2000 వ్రతాల కోసం నిరీక్షించే భక్తులను ప్రత్యేక క్యూల ద్వారా ఆయా వ్రతమండపాలకు చేరుకుంటారని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా టూవీలర్లు, నాలుగుచక్రాల వాహనాలకు విడివిడిగా పార్కింగ్‌కు నిర్దేశించామన్నారు. టూవీలర్స్ పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద, 4చక్రాల వాహనాలు సత్యగిరి జంక్షన్ హరిహరమార్గ్, సీఆర్వో కార్యాలయం ఎదురుగా, ప్రకాష్‌సదన్ ఎదురుగా, ఈవో కార్యాలయ సమీపంలో స్థలం కేటాయించామని, సుమారు వెయ్యి నాలుగుచక్రాల వాహనాలకు పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

అదనంగా 35 మంది హోంగార్డులు..

ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు మాట్లాడుతూ గతేడాది మాదిరిగా గిరిప్రదక్షిణలో ఉదయం స్వామివారి పల్లకీలో తిరిగేవిధంగా మధ్యాహ్నం భక్తులు సత్యరథం కూడా గిరియాత్ర చేపట్టాలని నిర్ణయించడంతో ప్రస్తు తం ఉన్న భద్రతాసిబ్బందికి అదనంగా 35మంది హోంగార్డులను నియమిస్తామన్నారు. ప్రస్తుతం 20 వాకీటాకీలుండగా మరో 40 వాకీటాకీలు తీసుకుని ఎక్కడా అవాంతరం లేకుండా చూస్తామన్నారు. స్రీశక్తి పథకం అమలులో ఉన్నందున మహిళాభక్తులు అధి కంగా వస్తారని అందుకోసం మహిళా హోంగార్డులను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే సీఐకు సూచించారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకునే బాధ్యత ఆలయ, సన్నిధి విభాగ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో 480 మరుగుదొడ్లు ఉండగా అదనంగా మరో 22 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4730 మంది వేచిఉండేలా హోల్డింగ్ పాయింట్లను, 925మందికి ఉచిత డార్మెటరీలలో లాకర్లు, స్నానపుగదులు అందుబాటులో ఉంచామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ప్రణాళిక

ఫైర్‌శాఖ అధికారులు కార్తీకం ప్రారంబానికి ముందే అగ్నిప్రమాద నివారణ నష్టం లేకుండా ముందుగా శిక్షణ ఇవ్వడంతో పాటుగా ఫైరింజన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించడం జరిగిందని దానికి పక్కా ప్రణాళికతో ముందుకెళతామని ఫైర్ ఆడిట్ జరుగుతందని తుని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

నెలరోజులు ఇద్దరు గజ ఈతగాళ్లు..

స్వామివారి తెప్పోత్సవానికి సంబంధించి పంపా రిజర్వాయర్‌లో 94 అడుగుల నీటిమట్టం ఉండేలా చూస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గతంలో తెప్పోత్సవం రోజున మాత్రమే గజఈతగాళ్లను అందుబాటులో ఉంచగా నెలరోజులు కార్తీకమాసం పుణ్యస్నానాలు పంపాలో చేస్తారనే ఉద్దేశ్యంతో నెలరోజులు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్‌సరఫరా నిరంతరాయంగా ఉండాలని, లూజు కలెక్షన్‌లు సరిచేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొండపైన రెండుచోట్ల, కొండదిగువున ఒకచోట 24 గంటలు అందుబాటులో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని వైద్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. 108 వాహనం అందుబాటులో ఉంచుతామన్నారు. ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. గ్రామంలో శానిటేషన్ నిర్వహణపై తమకు గతేడాది మాదిరిగా అదనపు పారిశుధ్య సిబ్బందిని కేటాయిస్తే కొండదిగువ పారిశుధ్య బాధ్యతలు తీసుకుని ఎక్కడా ఇబ్బందిలేకుండా చూస్తామని సర్పంచ్ కుమార్‌రాజా ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో తహశీల్దార్ తాతారావు, దేవస్థానం ఏఈవోలు, సూపరెంటెండ్‌లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అంతకముందు ఎమ్మెల్యే సత్యప్రభ స్వామిని దర్శించుకున్నారు.

కాల్వలో జారి పడి వ్యక్తి మృతి


సత్యనారాయణ మూర్తి (ఫైల్)

దేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాల్వలో జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవరపల్లి మండలం బంధపురం గ్రామానికి చెందిన గంటా సత్యనారాయణమూర్తి (60) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తాడిపూడి కాల్వలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మరణించాడు. మృతదేహాన్ని స్థానికులు పైకి తీసుకొచ్చారు. గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ట్రైనీ ఎస్ఐ దినేశ్ తెలిపారు. సత్యనారాయణ మూర్తి కుమారుడు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పిఠాపురంలో వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్య చేసి ఉంటారని అనుమానాలు


పిఠాపురం శివారు పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం

పిఠాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించాడు. అతడిని హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆర్వోబీ సమీపంలోని పంట పొలాల్లోకి బుధవారం ఉదయం వచ్చిన రైతులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ ఎస్ఐ మణికుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అక్కడ ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది మద్యం తాగినట్టు ఆధారాలు గు ర్తించారు. మరణించిన వ్యక్తి మృతదేహం ముఖ ంపై ఉన్న గాయాల ఆధారంగా మద్యం మత్తు లో రాయితో కొట్టి హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. అక్కడ మృతుడి సెల్‌ఫోన్ లభ్య మైంది. ఫోన్ లాక్ చేసి ఉండడంతో దానిని తెరిచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. వయసు 35-38 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సత్యదేవుడి నమూనాలయం వద్ద హైమాస్ట్ లైట్ల ప్రారంభం

అన్నవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం వద్ద బుధవారం సాయంత్రం సుమారు రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ హైమాస్ట్ లైట్లను తుని ఎమ్మెల్యే దివ్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వీటి వల్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందని, ఆలయం దేదీప్యమానంగా వెలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణ తదితరులు పాల్గొన్నారు.


లైట్లను ప్రారంభిస్తున్న తుని ఎమ్మెల్యే దివ్య

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'మ్యూజియాన్ని వినియోగంలోకి తీసుకురావాలి'

పెద్దాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న మ్యూజియాన్ని తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనరు శ్రీకాంత్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రజలకు సందర్శించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు ఆర్లెళ వీరరాఘవరావు, వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సాయం అందజేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

పేద విద్యార్థుల చదువుకు రూ.40వేలు సాయం

కాకినాడ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక భానుగుడి ఏరియాలోని అంబిక ఎక్వేరియం రెస్టారెంట్ సామాజిక సేవలో భాగంగా బుధవారం ఇద్దరు పేద విద్యార్థులకు చదువు నిమిత్తం శ్రీయువసేన సేవా సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ద్వారా రూ.40వేలు సాయం అందించారు. కాకినాడకు చెందిన 7వ తరగతి విద్యార్థి శ్రీరామ్‌పవన్ తండ్రి గత సంవత్సరం ప్రమాదంలో మృతి చెందగా అతని చదువుకు ఇబ్బంది ఏర్పడింది. సామర్లకోటకు చెందిన 6వ తరగతి విద్యార్థిని పూజా శరణ్య తండ్రి అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితం కావడంతో చదువుకు ఇబ్బంది కలిగింది. ఈ విద్యార్థుల కుటుంబీకులు శ్రీయువసేన సేవా సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్‌ను ఆశ్రయించగా ఈ సాయం సమకూర్చారు. శ్రీయువసేన సహాయ నిధికి ఎంపీ రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు నున్న దొరబాబు, పెదబాబు, గొల్లపల్లి వీరబాబు, రెస్టారెంట్ నిర్వాహకులు కోన సతీష్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పీఎస్ రాజు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కాకినాడ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో ఆదిత్య శ్రీనగర్ పాఠశాల విద్యార్థులు 28 మంది ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి తెలిపారు. వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ టి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి అభినందించారు. కాకినాడ సాలిపేటలోని పీఎస్ రాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ హాకీ ఎంపికల్లో అండర్-14, 17 విభాగాల్లో మొత్తం 14 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ మేరీ తెలిపారు. వారిని హెచ్‌ఎంలు పుష్పగిరి, విశాలాక్షి వ్యాయామోపాధ్యాయినులు రమ, మేరీ, రాజేశ్వరి అభినందించారు.



మీడియా సమావేశంలో మట్లాడుతున్న రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ సునీత

'అత్యాధునిక రేడియేషన్ యంత్రంతో క్యాన్సర్ చికిత్స'

కాకినాడ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా క్యాన్సర్ చికిత్సకు అత్యాధునిక యంత్రం అందుబాటులోకి వచ్చిందని హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ ఎం.సునీత వెల్లడించారు. స్థానిక జీఆర్‌టీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎంఆర్ లైనక్ యంత్రంతో రేడియేషన్ చికిత్స విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమె వివరించారు. ట్రీట్‌మెంట్ సమయం చాలా తక్కువని, కొన్ని సందర్భాల్లో కేవలం ఐదు రోజుల్లోనే చికిత్స పూర్తవుతుందన్నారు. సమావేశంలో హాస్పిటల్స్ డీజీఎం సంతోష్‌కుమార్, ఏపీ టీమ్ లీడర్ ఎన్.బాలవీరభద్ర, ఎగ్జిక్యూటివ్ ఎన్.శివకుమార్ పాల్గొన్నారు.


పిఠాపురం ఆటో యూనియన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

'ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి'

పిఠాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని కార్యవర్గ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల 13 ఆటో యూనియన్ల సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. అందరూ ఏకతాటిపై నడవాలని నిర్ణయం తీసుకున్నారు. అన్ని యూనియన్లతో కలిపి పట్టణ ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.మంజునాథ్, బచ్చుల శ్రీనివాస్, గుల్ల విజయభాస్కర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పలివెల గోవిందు, కన్నాబత్తుల వినయకుమార్, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రాజశేఖర్, కోశాధికారిగా షేక్ నాయబ్‌బాషా, ఉపాధ్యక్షుడిగా గింజాల ఏసుదాసు ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించిన కేంద్ర మంత్రిత్వ శాఖ

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను పెద్ద ఎత్తున సాగుచేసి సన్న, చిన్నకారు రైతులను అత్యధికంగా ప్రోత్సహించాలని మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్ న్యూఢిల్లీ జాయింట్ సెక్రటరీ ఆదేశించారు. బుధవారం ఆయన ఏపీలోని వివిధ జిల్లాల డ్వామా పీడీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూరగాయలు, పండ్ల తోటల పెంపకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కాంపోనెంట్ మెటీరియల్‌కు కూడా టెండర్ల ద్వారానే నిర్వహించాలన్నారు. ఉపాధి కూలీల ఆధార్ కార్డులను ఈ-కేవైసీ చేయించాలన్నారు. దీనివల్ల మస్తర్లలో అక్రమాలకు పూర్తిగా చెక్ పెట్టవచ్చన్నారు. ఇక నుంచి ఎన్‌ఎంఎంఎస్ విధానంలో హాజరు వేసేందుకు సన్నద్ధం కావాలని కోరారు. కాకినాడ జిల్లాలో ఉద్యాన పంటల సాగు బాగుందని ప్రశంసించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డ్వామా ఫైనాన్స్ మేనేజరు విజయ్‌భాస్కర్, పరిపాలనాధికారి అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతాం

ఐసీడీఎస్ పీడీ లక్ష్మి


గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి

సామర్లకోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'అంగన్వాడీ కేంద్రాలను ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది... ఇందులో భాగంగా అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సీడీపీవోలను, సూపర్‌వైజర్లను సంసిద్ధం చేస్తున్నాం' అని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి వెల్లడించారు. సామర్లకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం ఆమె కాకినాడ జిల్లా పరిధిలోని తొమ్మిది ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయసు పిల్లల ఎదుగుదల కాలాన్ని బాల్యారంభ దిశగా పరిగణిస్తే... ఆ సమయంలోనే వారిలో అన్ని విధాలుగా ఎదుగుదలకు ఉపయోగపడే బీజాలు నాటాలన్నారు.

అనంతరం పీడీ విలేకరులతో మాట్లాడారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయడం, ఆటపాటలతో ఒత్తిడి లేకుండా విద్యనందించడం, ప్రాథమిక పాఠశాలలో ప్రవేశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, విద్యా అసమానతలను తగ్గించడం, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలను సాధించేందుకు సీడీపీవోలకు, సూపర్‌వైజర్లకు మార్గదర్శకాలు అందిస్తున్నామన్నారు. శిశు వికాసంలో భాగంగా సృజనాత్మకత వ్యక్తీకరించడం, శిశు విద్యా కార్యక్రమాలు, వస్తువులు, సామగ్రి, కార్యక్రమాల నిర్వహణలో అంగన్వాడీ టీచర్ పాత్ర, కార్యక్రమాల నిర్వహణకు ఆధారాలు, శిశు వికాసంలో నిత్యం పాటించాల్సిన అంశాలు, ప్రత్యేక కార్యక్రమాలు, పాఠశాలల సంసిద్ధతలను వివరించామన్నారు. అంతకు ముందు సామర్లకోట అర్బన్ పరిధిలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి వారికి పౌష్టికాహార కిట్‌లను పీడీ లక్ష్మి అందజేశారు. సీడీపీవోలు జి.ఉష, దుర్గాదేవి, జెస్సీ ఫ్లోరెన్స్, పద్మావతి, శ్రీలలిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తపాలా బిళ్లల సేకరణను మంచి అలవాటుగా మార్చుకోవాలి

జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు


ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాంప్‌లను చూస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు

కాకినాడ సిటీ/కాకినాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ తపాలా బిళ్లల సేకరణను మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు పిలుపునిచ్చారు. నగరంలోని సూర్యకళా మందిరంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిలోత్సవం-2025కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా స్థాయి ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ (తపాలా బిళ్లల ప్రదర్శన)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిలాటలీ అభిరుచి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల ద్వారా ఈ కళను అజరామరంగా భావితరాలకు అందించాలన్నారు. మరో ముఖ్య అతిథి, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలాటలీ) జి.శివనాగరాజు మాట్లాడుతూ అనేక రకాల, రంగాల అరుదైన తపాలా బిళ్లలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ మాట్లాడుతూ మొబైల్స్, అంతర్జాలం వేగంగా విస్తరించి, వ్యక్తిగత ఉత్తరాలు పూర్తిగా అంతరించిపోయే దశలో కూడా ఫిలాటలీ అభిరుచి గల అభిమానులు, ఔత్సాహికులు ఒకే వేదికపై తరచూ ఇలాంటి ప్రదర్శనల ద్వారా ఈ కళకు జీవం పోస్తున్నారని కొనియాడారు. పోస్టల్ స్టాంపులు విద్యార్థుల్లో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ గురువారం కూడా కొనసాగుతుందని, నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు తిలకించాలన్నారు. కార్యక్రమంలో తపాలా శాఖ కాకినాడ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు గంటి రామకృష్ణ, వీవీ రమణమూర్తి, డి.అనిల్ అంబేద్కర్ కుమార్, ముదుగు లక్ష్మణకుమార్, ముదుగు లక్ష్మణ్ కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు బి.బ్రహ్మం నాయక్, బి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఔత్సాహికులు, ఫిలాటలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు.


కాకినాడలో వ్యాపారులు, ప్రజలకు జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



జీఎస్టీపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు

జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఊరట

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



పిఠాపురంలో జీఎస్టీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

కాకినాడ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 విధానంతో సామాన్య ప్రజలకు ఊరట కలుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన మెయిన్‌రోడ్‌లో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' కార్యక్రమం నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ నూతన విధానం వల్ల చేకూరే ప్రయోజనాలను వ్యాపారులకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, గదుల సాయిబాబు, నల్లారి శ్రీనివాస్, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, గుజ్జు లక్ష్మణరావు, మనోహర్ గుప్తా, పొంగా బుజ్జి, విసంశెట్టి బాబ్జీ, రిక్కా లక్ష్మి ముత్యాల రాణి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కళాశాలలో సదస్సు జరిగింది. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరిపారు. జీఎస్టీ శ్లాబులను కేంద్రం మార్చడంతో ప్రతి కుటుంబానికీ ఆర్థికంగా ప్రయోజనం కలిగిందని వివరించారు. ప్రిన్సిపాల్ వి.కేశవరావు, సీనియర్ లెక్చరర్లు డాక్టర్ శారద, మాధవి, ఏసీఎంసీ హస్సేన్, ఎన్ఎస్ఎస్ అధికారులు శోభన్‌బాబు, డి.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల కామర్స్ అర్థ శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'సూపర్ జీఎసీ-సూపర్ సేవింగ్స్', జీఎస్టీ నూతన సంస్కరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎస్టీ విభాగం సహాయ కమిషనరు బీపీ నాయుడు, జీఎస్టీవో జీవీవీ సత్యనారాయణ, ఏఈవో జయరావు హాజరు కాగా కామర్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన నూతన సంస్కరణలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు వెంకటేశ్వరరావు, పాండురంగారావు, నాగేశ్వరరావు, మధుప్రసాద్, నూకరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ కళాశాల నుంచి బాలాజీచెరువు కూడలి వరకు విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డీఐఈవో ఐ.శారద, జీఎస్టీ విభాగం సహాయ కమిషనరు బీపీ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.



కారులో... హుషారుగా...

సామర్లకోట పట్టణానికి చెందిన జనసేన యువ నాయకుడు గౌతమ్ వివాహం సందర్భంగా బుధవారం నిర్వహించిన భారీ ఊరేగింపు పలువురిని ఆకట్టుకుంది. పురాతన కాలం నాటి కారును అందంగా అలంకరించగా పెండ్లి కుమారుడు అందులో ఆశీనులయ్యాడు. వాహనం ముందు రెండు శ్వేత అశ్వాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)



కాకినాడ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా

కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ షాన్‌మోహన్ కొనసాగనున్నారు. పాలకవర్గాల గడువు ముగియడంతో ఇప్పటివరకు ఆయన స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సెప్టెంబరు 15తో గడువు పూర్తవడంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.209 ద్వారా ఆయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది.

దక్షిణ భారత సమన్వయకర్తగా

పిల్లా చంద్రం



గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక అకాడమీ సలహా మండలి సభ్యుడిగా, దక్షిణ భారతదేశ సమన్వయకర్తగా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) జాతీయ చైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధనా విశ్వవిద్యాలయం (యస్‌వోఫ) నుంచి ఆయనకు నియమాక ఉత్తర్వులు అందాయి. విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల పురోగతి, వారి పరిశోధనలకు సహకారం అందజేస్తానని చంద్రం చెప్పారు.

ఎంఎస్ఎన్ చార్టీస్ పాలకమండలి నియామకం

కాకినాడ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో దేవదాయ శాఖకు చెందిన ఎంఎస్ఎన్ చార్టీస్‌కు పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వంశపారంపర్య ధర్మకర్తగా మల్లాడి కార్తీక్ నాయకర్, ధర్మకర్తలుగా శిగటాపుల రామారావు, నులుకుర్తి సత్యసాయి, మూగు చిన్ని, పిల్లారిశెట్టి దుర్గాప్రసాద్, రాళ్లపూడి ప్రకాష్, పీర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మండపాక త్రిలోచన, దూళిపాల సూర్య భగవాన్‌లను నియమించారు.



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు 'శ్రీనగర్' పాఠశాల విద్యార్థుల ఎంపిక

కాకినాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు నగరంలోని శ్రీనగర్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 4, 6 తేదీల్లో రాజమహేంద్రవరం, కాకినాడల్లో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వివిధ విభాగాల్లో వారు ప్రతిభ కనబరిచారు. కరాటే అండర్-14 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.అవంతిక, ఎనిమిదో తరగతి విద్యార్థిని వీర హారిక, టైక్వాండో అండర్-14 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కుమిలి నవ్య, రైఫిల్ షూటింగ్ అండర్-17 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని షేక్ జోహాసిద్రా, ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని పెంకే దుర్గా హర్షిణి, ఫుట్‌బాల్ అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థిని దమ్ము స్పందన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.మౌని తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని ఎం.సత్యలక్ష్మి, ఉపాధ్యాయుడు సాయిబాబా అభినందించారు.

'కల్తీ మద్యం పాపం వైసీపీదే'

పెద్దాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం పాపం వైసీపీదే అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు కల్తీ మద్యంతో ప్రజలు ప్రాణాలు తీసిన వారిని జగన్ ఏం చేశారని, ఇప్పుడు కల్తీ మద్యంపై దొరికిన వారంతా వైసీపీ మూలాలు ఉన్నవాళ్లే కదా అని ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు. తంబళ్లపల్లె నకిలీ మద్యం కేసులో అరెస్టు చేసిన వారిపై విచారణ జరిపిస్తున్నారని గుర్తు చేశారు. కల్తీ మద్యం మూలాలు తాడేపల్లి చుట్టూనే ఉన్నాయన్నారు. కల్తీ మద్యంపై వైసీపీ నాడు ఒకలా నేడు ఒకలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

సామర్లకోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పండ్రవాడలో ఉచిత పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ప్రారంభించారు. ఏపీఎల్డీఏ ఈవో కాంతారావు, ఏడీ డాక్టర్ ప్రమీల, వీఏఎస్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ కిరణ్మయి 78 గేదెలకు, 22 ఆవులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పశుపెంపకందారులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లను సర్పంచ్ పెంకే శ్రీనివాసు అందజేశారు. నార్ల వెంకటరమణ, రాయుడు నాగబూషణం, అనుసూరి రాజబాబు, మల్లంపల్లిశ్రీనువాసు పాల్గొన్నారు.

నాతి బుజ్జి సేవలు ప్రశంసనీయం

గండేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):రాజమండ్రి జిల్లా హౌసింగ్ పీడీగా బాధ్యతలు చేపట్టిన నాతి బుజ్జిని బుధవారం గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.గండేపల్లి ఎంపీడీవోగా బుజ్జి అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ చలగల దొరబాబు, ఏవో కె.చంద్రరావు, ఏపీవో కృష్ణంరాజు, ఈసీ రమేష్, టీఏలు శ్రీను మోహన్, శ్రీను బాబు సిబ్బంది శేఖర్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే యనమల దివ్య

తునిరూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమంసాధ్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తునిలో జీఎస్టీ అధికారులు బుధవారం నిర్వహించిన సూపర్‌జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణల వల్ల రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకువెళుతుందన్నారు. జీఎస్టీ2.0 వల్ల వస్తువుల ధరలు తగ్గి ప్రతి వినియోగదారుడికి ఆర్థిక వెసులుబాటు లభించిందన్నారు. స్వదేశీ ఉత్పత్తి పెరిగినప్పుడే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జీఎస్టీ అధికారులు దయానంద్, పి.ధర్మారావు, మాధవిలత, కోటనందూరు ఎంపీడీవో వెంకటనారాయణను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొచ్చెర్ల పాటి రూపాదేవి, కుసుమంచి సత్యనారాయణ, కుక్కడపు బాలాజీ, చాంబర్ అధ్యక్షుడు నకురు నాగేంద్రనెహ్రూ పాల్గొన్నా రు.ఎమ్మెల్యే యనమల దివ్య తునిలో మహిళా సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలో నిత్యావసర సరుకుల ధరల్లో వచ్చిన మార్పులను గమనించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.



తునిలో సూపర్‌మార్కెట్‌లో సరుకుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివ్య

ప్రత్తిపాడులో కెనరా బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

ప్రత్తిపాడు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను బుధవారం ఆ బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ సీజే విజయలక్ష్మి, కాకినాడ అసిస్టెంట్ రీజనల్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ ప్రారంభించారు. క్యాష్ కౌంటర్‌ను ఏపీ ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, స్టాఫ్ చాంబర్‌ను స్థానిక వ్యాపార వేత్త బండారు బాబురావు ప్రారంభించారు. బీఎం పద్మరాజు, బ్యాంక్ మేనేజర్ పాఠంశెట్టి పద్మ, అసిస్టెంట్ మేనేజర్ మణికంఠ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన



పార్కు పనులను పరిశీలిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డు శివారు కోనేటి వద్ద గల చెరువుకు సంబంధించి పార్కు, వాకింగ్ ట్రాక్, బోట్ షికారు పనులు వేగంగా సాగుతున్నాయి. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పనులను పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ఇక్కడ పార్కు, వాకింగ్ ట్రాక్, బోట్ షికారు, చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, భూపాలపట్నం ప్రసాద్, రాయి సాయి, నలమాటి ఆనంద్, హరి గోపాల్, తోట అనిల్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

ఏలేశ్వరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేతృత్వంలో ఈనెల28న జగ్గంపేట వేదికగా జరిగే మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు.బుధవారం భద్రవరం గ్రామంలో స్థానికులకు కరపత్రాలు పంచి సభకు తరలిరావాలని విస్తృత ప్రచారం చేశారు. జక్కంపూడి రాజు, ఏలియ, నూకరత్నం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలో బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మల్లేపల్లి గ్రామానికి గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు.

12న నీటిపారుదల పథకానికి శంకుస్థాపన

జగ్గంపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):జగ్గంపేట మండలం మామిడాడలోరూ.3.49కోట్లతో చేపట్టే దివంగత జ్యోతుల పాపారావు నీటిపారుదల పథకానికి ఈనెల12నభారీమధ్య తరహా, చిన్న నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. బుధ వారం మామిడాడలో శంకుస్థాపన చేసే ప్రాం తాన్ని పోలవరం ఈఈ శ్రీనివాసుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం, కాండ్రేగుల, గొల్లలగుంట, మర్రి పాక గ్రామాలకు సంబంధించిన 3500ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు ఈనీటి పారుదల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారని,ఈనెల12న మంత్రి నిమ్మలతో శంకుస్థాపన చేయించి, అనంతరం ఈప్రాంత రైతులతో సభ నిర్వహిస్తామన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టీడీపీ యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి, పోలవరం డీఈ ప్రసాదరావు, పోలవరం ఏఈ సంతోష్, బోదిరెడ్ల సుబ్బారావు, మండపాక అప్పన్నదొర, వేగి రామకృష్ణ, పెంటకోట సత్యనారాయణ,బొడ్డేటి సుమన్, వేగి రాంబాబు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో మండల స్థాయి క్రీడాపోటీలు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ, కోకో, షటిల్, వాలీబాల్ మండల లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో టి.జోసెఫ్ ఆధ్వర్యంలో హెచ్ఎం రమణికుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ తోట రవి, తోట గాంధీ విచ్చేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన క్రీడా పోటీల్లో కోకో అండర్-14లో కిర్లంపూడి, అండర్-17లో కోకో విన్నర్స్ కిర్లంపూడి, కబడ్డీ పోటీలు విజేతలు అండర్-17లో గెద్దనాపల్లి, అండర్-14లో తామరాడ, వాలీబాల్ అండర్ 17లో కిర్లంపూడి, అండర్-14లో తామరాడ, సెటిల్ అండర్-17 లో అండర్-14లో కిర్లంపూడి విన్నర్స్‌గా నిలిచారు. వారిని కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, హైస్కూల్ చైర్మన్ ఆళ్ళ బాబులు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, యల్లపు దొరబాబు, మాజీ స్కూల్ చైర్మన్ గోవిందు పీడీలు అభినందించారు.

అడబాలకు పితృ వియోగం



జగ్గంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రామవరానికి చెందిన తెలుగు యువత రాష్ట్రఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు అడబాల ముసలయ్య (చంటి) అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పారిశుధ్య కార్మికులు

అన్నవరం అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నూతన పారిశుద్య కాంట్రాక్ట్ నిబంధనల్లో 50 ఏళ్లకు పైబడిన కార్మికుల తొలగింపు వ్యవహారంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. బుధవారం అన్నవరం విచ్చేసిన ఎమ్మెల్యే సత్యప్రభను కార్మికులు కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయం జరుగుతందని, దీనిపై చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఏలేశ్వరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంపీడీవో రవికుమార్ వర్మ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ఫెడరేషన్ నేతృత్వంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అండర్ 14,17 విభాగాల్లో రెండు రోజులు జరిగే క్రీడలను ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ తులసి ప్రారంభించారు. 8జట్లు బాలికలు, బాలల వాలీబాల్, కోకో, చెస్, యోగా, షటిల్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో తలపడనున్నాయని పీఈటీ సతీష్ తెలిపారు. ఫైనల్‌కు ఎంపికైన జట్లు డివిజన్‌స్థాయిలో పాల్గొంటాయన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, ఎంఈవో బి.అబ్బాయి, కౌన్సిలర్లు మూదినారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, టీడీపీ నాయకులు జిగటాపు సూరిబాబు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రత్తిపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన ఉపాధ్యాయుడు గుడాల సుందర్రావుకు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ఇండియా క్రిస్టియన్ అసోసియేషన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. బుధవారం ప్రత్తిపాడులో సుందర్రావు, సతీమణి రాజ్‌కమల్‌లను సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం శాలువా కప్పి సన్మానించారు.

ముద్రగడ పర్యటన

ప్రత్తిపాడు,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): టి.రాయవరంలో వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం పర్యటించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ఎంపీటీసీ తటపర్తి రామన్నదొరను పరామర్శించారు. బత్తుల నాగార్జున, రామిశెట్టి నాని, కొండిశ్రీను పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రత్తిపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సత్తెమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన ంలో 8వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

సందీప్‌కు సత్కారం

ఏలేశ్వరం, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ప్రశంసాపత్రం అందుకున్న స్పార్క్ సంస్థ సీఈవో సాయి సందీప్‌ను ప్రత్తిపాడు వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్, మాజీ కౌన్సిలర్లు సుంకర రాంబాబు, జువ్విన వీర్రాజు, శిడగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి చర్యలు : పీవో

రంపచోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాలు వెదురు ఉత్పత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ అన్నారు. బుధవారం స్థానిక వైటీసీలో ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌కి డీఎఫ్‌వో రవీంద్ర దామ, సబ్ డీఎఫ్‌వో అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పీవో మాట్లాడుతూ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గంగవరం మండలాల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బుధవారం, గురువారం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నాలుగు మండలాల్లో అటవీ హక్కుల భూములలో వెదురును అభివృద్ధి చేసి వాటితో వివిధ రకాల వస్తువులు తయారు చేసి మార్కెటింగ్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి గ్రామంలో వెదురును సంరక్షించుకొనే బాధ్యత ఆయా గ్రామాల ప్రజలపై ఉందన్నారు. తహశీల్దారు బాలాజీ, ఎంపీడీవో వై.రాజబాబు, ఇండియన్ స్కూల్ బిజినెస్‌మెంట్ ప్రతినిధులు హేమంత్, కామిని, నానిబాబు, ఆర్వోఎఫ్ఆర్ అధికారి జీ.ఆనంద్, ఆర్ఐ నిర్మల, వీఆర్వో శివకుమార్, వైటీసీ మేనేజర్ సుధీర్, నాలుగు మండలాల వీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా స్వయంసహాయక సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 పై ప్రజలకు అవగాహన



దుకాణాల వద్ద కరపత్రాలు పంచుతున్న అధికారులు, ఇతరులు

మోతుగూడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్. రఘుబాబు ఆధ్వర్యంలో ప్రజలకు, చిన్న దుకాణదారులకు కరపత్రాలు పంచుతూ బుధవారం అవగాహన కల్పించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో రాష్ట్ర ప్రజలకు సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యిందన్నారు. ఉప సర్పంచ్ నాగ్ జయదాసు, కూటమి పార్టీల నేతలు, మావూరి వీర వెంకట సత్యనారాయణ, నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, కిముడు సహదేవ్, మావూరి శ్రీను,ప్రవీణ్, శంకర్, కోటి, శ్రీను, రాజారావు, రాంబాబు, సచివాలయ సిబ్బంది శివప్రసాద్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రామ్మూర్తి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతూరులో ఐద్వా జిల్లా మహా సభ

చింతూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చింతూరులో ఐద్వా జిల్లా రెండో మహాసభ గురువారం జరగనుంది. ఈ మేరకు బుధవారం చింతూరులో ఆ సంఘ నాయకత్వం విరాళాలు సేకరించింది. దీనిలో భాగంగా మహాసభను జయప్రదం చేయాలని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. విరాళాల సేకరణలో బాగంగా టీడీపీ మండలాధ్యక్షుడు జమాల్‌ఖాన్ తన వంతు విరాళంగా క్వింటా బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ. పద్మావతి, సంఘ నాయకురాలు రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

చింతూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని టీఏఆర్ఎల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవల్) రాష్ట్ర నోడల్ అధికారిణి కల్పన పేర్కొన్నారు. బుధవారం టీఏఆర్ఎల్ శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో- 1 వీవీ లక్ష్మీనారాయణ, ఎంఈవో- 2 జీ. వెంకటేశ్వర్లు, రిసోర్స్‌పర్సన్లు, హెచ్ఎంలు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

15లోగా దరఖాస్తు చేసుకోండి

రంపచోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అద్దె ప్రాతిపాదికన షాపులు కావాల్సిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు. ఈనెల 15 లోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించి, లాటరీ పద్ధతిపై షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు.

ఇద్దరు గిరిజనులకు డెంగీ లక్షణాలు

ఎటపాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు గిరిజనులకు జ్వరం రావడంతో వైద్యపరీక్షలు నిర్వహించగా, డెంగీ నిర్ధారణ అయ్యింది. దీంతో లక్ష్మీపురం పీహెచ్‌సీలో వైద్యచికిత్స అందించారు. బూరుగువాయితండాకు చెందిన పాయం శ్రీనుకు ఐదు రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో లక్ష్మీపురం పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించగా, ప్లేట్‌లైట్స్ క్షీణించాయి. అలాగే లింగాలపల్లికి చెందిన పెనుబల్లి రామరావుకు కూడా తీవ్ర జ్వరం వచ్చి ప్లేట్‌లైట్స్ పడిపోవడంతో వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. దీంతో ఇద్దరికి ఐదురోజులపాటు వైద్యాధికారి మురళీకృష్ణ పర్యవేక్షణలో వైద్య చికిత్స అందించారు. కాగా ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం వారిని పీహెచ్‌సీ నుంచి డిశ్చార్జి చేశారు.

ఆదివాసీ మహిళకు పాముకాటు

ఎటపాక, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళ పాముకాటుకు గురైంది. ఈ ఘటన బుధవారం లక్ష్మీపురం పంచాయతీ చింతలపాడు వలసలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భద్రమ్మ ఇంట్లో నేలపై నిద్రిస్తున్న క్రమంలో తెల్లవారుజామున పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు నాటు, పసరు వైద్యంతో చికిత్స అందించారు. ఈనేపథ్యంలో 12 గంటల తర్వాత బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సమీపంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీకు తీసుకురాగా, పరీక్షించిన వైద్యాధికారి మురళీకృష్ణ వెంటనే ఆమెకు వైద్య చికిత్స అందించారు. దీంతో భద్రమ్మ ప్రాణాపాయం నుంచి బయటపడింది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి
- ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాల అమలు, గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటీడీఏలో పర్యటించిన జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్టీ)ను కలిసి వినతి పత్రం అందజేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనేతరులు విచ్చలవిడిగా బయట ప్రాంతాల నుంచి వలసలు వచ్చి ప్రభుత్వ, ఆదివాసీ భూములను ఆక్రమణలు చేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అల్లూరి జిల్లాలో వెయ్యికి పైగా అక్రమ కట్టడాలు ఉన్నాయని, ఏజెన్సీలో ఎన్టీసీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో మైనింగ్ క్వారీ విషయంలో ఎన్‌సీఎస్టీ నుంచి జిల్లా కలెక్టర్‌కు నోటీసులు అందినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కమిషన్‌కు వివరించారు.

దెబ్బగూడెంలో తాగునీటికి కటకట

మోతుగూడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం గూడూరు పంచాయతీ దబ్బగూడెంలో తాగునీటి సమస్య నెలకుంది. రోడ్డు పక్కన ఉన్న బోరు పంపు గత వారంరోజులుగా పనిచేయడం లేదు. దీంతో కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు బావికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న బోరింగ్ మరమ్మతులు చేసి తాగునీటి కష్టాలను తీర్చాలని దబ్బగూడెం గ్రామస్తులు కోరుతున్నారు.



పేరవరంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో లాభం
ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంపై ప్రజలకు ఎంతో లాభం చేకూరుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం మండలంలోని పేరవరం గ్రామంలో జీఎస్టీ 2.0పై ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించి కరపత్రాలు అందజేసి వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పి.మోహన్ పాల్గొన్నారు.



అన్నవరంలో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

దళిత నాయకుల నిరసన

అన్నవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడానికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని బుధవారం అన్నవరంలో దళిత నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్.మధుబాబు, టి.కిరణ్‌కుమార్, గోపిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో గౌరీదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

గౌరీదేవి ఉత్సవాలకు శ్రీకారం

ప్రత్తిపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీదేవి ఉత్సవాలకు బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. బుధవారం నంది సెంటర్ రామాలయంలో అమ్మవారికి గూడుపు వీధి గౌరీ ఉత్సవ కమిటీ సభ్యుడు బలిజ వీర్రాజు ఆధ్వర్యంలో మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారిని గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. రాత్రంతా జాగారంగా ఊరేగించి గురువారం ఉదయం గౌరీదేవి అమ్మవారిని గుడుపువీధి రామాలయం వద్ద ప్రతిష్టించడంతో గౌరీ శంకరుల మహోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

బాణసంచా ఘటనపై యనమల దిగ్ర్భాంతి



తుని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో జరిగిన బాణసంచా ప్రమాదంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు.



ఎస్.అగ్రహారంలో రోడ్డుపై పడిన బండరాయి

రహదారిపై పడిన బండరాయి
తప్పిన ప్రమాదం

రౌతులపూడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.అగ్రహారం గ్రామంలో బండరాళ్లు తరలిస్తున్న లారీ పైనుంచి బండరాయి కింద పడింది. గ్రామం మధ్యలో రోడ్డుపై పడటంతో ఆ సమయంలో అక్కడున్న స్థానికుడు కే.వీరబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో గ్రామస్తులు లారీలు నిలిపివేసి ఆందోళన చేశారు. గొయ్యిలో లారీటైర్ పడడం వల్ల రాయి పడిందని, గొయ్యిని కప్పేస్తామని మాట ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేసిన ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట గోకవరం గ్రామానికి చెందిన పోసిన వెంకటరమణ అనే దివ్యాంగుడికి చార్జింగ్ ట్రై సైకిల్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.భరత్ బాబు, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర, భూపాలపట్నం ప్రసాద్, తెలుగు యువత గోకవరం మండలాధ్యక్షుడు పల్లెల బాబి, పాలకుర్తి ఆదినారాయణ, పులపర్తి బుజ్జి, పైల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే యనమల దివ్య



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తున్నట్టు తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం బెండపూడిలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆమె ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తమకు ఖబరిస్తాన్‌కు అవసరమైన స్థలం మంజూరు చేయాలని ముస్లింలు విజ్ఞప్తి చేశారు. కాపులు, వైశ్యులకు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని, హిందూ శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, సాధనాల నూకరాజు, పాలచర్ల యర్రబ్బు, బూసాల శ్రీనివాసరావు, నరహరిశెట్టి సూర్య ప్రకాష్, చొక్కా అప్పారావు, కోడ వెంకటరమణ, కోరుకొండ శివ, బీజేపీ నేత వెలుగుల గోపాల కృష్ణ, జనసేన నేత బెండపూడి నాయుడు, అరిగెల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యారెడ్డి

గండేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి అన్నారు. బుధవారం మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ చలగల దొరబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బిట్రా వెంకటలక్ష్మి, ఏవో కె.చంద్రరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి, సర్పంచ్ ముత్యాల దుర్గారావు, కార్యదర్శులు ఫణీంద్ర కుమార్, చక్రధర్ చౌదరి, చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్ కిషోర్, పంచాయతీరాజ్ జేఈ కే.నారాయణ, వెంకర్నరీ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే

గండేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను ఆదుకున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల మోహన్ రావు అన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం అందజేసి నందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం గండేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు కె.సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి, పాలకుర్తి ఆదినారాయణ, సుంకవిల్లి సత్యనారాయణ, బొండా శ్రీనుబాబు, తెలగొరెడ్డి భద్రరావు, పోతుల కృష్ణ, టి.దుర్గారావు, వెంపాటి రాజు, సుంకవిల్లి రమేష్, చీకట్ల నాగరాజు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు